సాక్షి విశాఖపట్నం
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



మత్స్యకారులకు మొండి చెయ్యి
వేట విరామం ముగిసి మూడు నెలలు అయినా మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా దక్కలేదు. 8లో



యోగా పోటీలు ప్రారంభం
భీమిలి సమీపంలో కీతినపేట వద్ద ఉన్న సన్‌స్కూల్‌లో శనివారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో



శ్రీ నర్తన గణపతిగా సంపత్ వినాయగర్ 8లో

న్యూస్‌రీల్

20 నుంచి దుర్గ్-విశాఖ వందేభారత్

విశాఖలో రేపు ప్రారంభోత్సవం



తాటిచెట్లపాలెం: దుర్గ్-విశాఖ-దుర్గ్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 20 నుంచి రాకపోకలు సాగించనుందని ఈస్ట్ కోస్ట్ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలును సోమవారం సాయంత్రం 4.15 గంటలకు విశాఖపట్నంలో అతిథులు, అధికారులు జెండా ఊపి ప్రారంభిస్తారని పేర్కొంది. ప్రారంభోత్సవ రైలు రాయగడ వరకు మాత్రమే నడుస్తుందని, 20వ తేదీ నుంచి రెగ్యులర్ రైలు రాకపోకలు సాగించనుందని తెలిపింది. దుర్గ్-విశాఖపట్నం(20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గురువారం మినహా ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు దుర్గ్‌లో బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-దుర్గ్ (20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి అదే రోజు రాత్రి 10.50 గంటలకు దుర్గ్ చేరుకుంటుంది. మొత్తం 16 కోచ్‌లతో ఈ ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. రాయ్‌పూర్, మహాసముండ్, ఖరియార్ రోడ్, కంటాబంజి, టిట్లాగఢ్, కేసింగ, రాయగడ, పార్వతీపురం, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

11 మంది ఎస్‌ఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎంపాలెం లా అండ్ ఆర్డర్‌లో ఉన్న కె.సురేష్‌కుమార్‌ను త్రీటౌన్ లా అండ్ ఆర్డర్‌కు, ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌లో ఉన్న డి.వరలక్ష్మిని స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. పద్మనాభం లా అండ్ ఆర్డర్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న కె.శ్రీనివారావును వన్‌టౌన్‌కు అటాచ్ చేశారు. దువ్వాడ లా అండ్ ఆర్డర్‌లో ఉన్న సి.హెచ్.సూర్యనారాయణను పద్మనాభం లా అండ్ ఆర్డర్‌కు(సైబర్ క్రైమ్‌కు అటాచ్‌మెంట్), గాజువాక క్రైమ్‌లో ఉన్న కె.భాస్కర్‌రావును పీఎంపాలెం లా అండ్ ఆర్డర్‌కు, మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్.గౌరీని భీమిలి లా అండ్ ఆర్డర్‌కు పంపించారు. అలాగే వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్‌లో ఉన్న సిహెచ్.స్వామినాయుడును పెందుర్తి లా అండ్ ఆర్డర్‌కు, రేంజ్ నుంచి వచ్చిన ఎస్.సురేష్‌ను ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌కు, గాజువాక ట్రాఫిక్‌లో ఉన్న ఎస్.కృష్ణవర్మను గాజువాక ట్రాఫిక్‌కు(ఎంవీపీ లా అండ్ ఆర్డర్‌కు అటాచ్‌మెంట్ కూడా), సైబర్ క్రైమ్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎల్.శ్రీనివాసరావును దువ్వాడ లా అండ్ ఆర్డర్‌కు, సీటీఎఫ్‌లో ఉన్న ఎం.రాధాకృష్ణను గాజువాక లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు.

'35' సినిమా బృందం సందడి



మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్న 35 సినిమా బృందం

పీఎంపాలెం: స్థానిక సాంకేతిక టెక్నికల్ క్యాంపస్‌లో '35 చిన్న కథ కాదు' సినిమా బృందం శనివారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం సందడిగా సాగింది. '35' సినిమాను విజయవంతం చేయడంపై చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సిద్ధార్థ మాట్లాడుతూ మంచి చిత్రాలు తీస్తే విజయవంతం చేస్తారని ప్రేక్షకులు మరోసారి నిరూపించారని, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలను అందిస్తామన్నారు. సినిమా హీరోయిన్ నివేదా థామస్, హీరో విశ్వదేవ్ రాచకొండ, దర్శకుడు నందకిశోర్ ఏమని తదితరులు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ ఆళ్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భట్ తదితరులు పాల్గొన్నారు.

3,684 మంది లైసెన్స్‌లు తాత్కాలిక రద్దు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా తిరుగుతున్న 3,684 మంది ద్విచక్ర వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రద్దు 3 నెలల పాటు ఉంటుందన్నారు. పోలీస్ శాఖ, రవాణా శాఖ వేర్వేరుగా చేపట్టిన తనిఖీల్లో ఈ నెల 9వ తేదీ వరకు 3,955 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 3,684 మంది లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై తిరగవద్దని సూచించారు.

వైద్య విద్యను దూరం చేసే కుట్ర



మధ్య తరగతి, నిరుపేద విద్యార్థులకు వైద్య విద్య అందేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఐదు కళాశాలలను ప్రారంభించింది. మరో ఐదింటి నిర్మాణాలు పూర్తి చేసింది. ఏడు కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణం.నా కుమార్తెకు నీట్‌లో 603వ ర్యాంక్ వచ్చింది. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటురాలేదు. ప్రైవేట్ మెడికల్ కళాశాలలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను.
– జ్ఞానేంద్రరెడ్డి, అక్కయ్యపాలెం



వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. తద్వారా ఒక్కో కళాశాలకు 150 సీట్లు వచ్చేవి. వైద్య కళాశాలలు నడపలేమంటూ కేంద్రానికి లేఖ రాయడం చూస్తుంటే.. విద్యార్థుల భవిష్యత్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే తెలుస్తోంది. మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు నిలుపుదల చేయడం సరికాదు. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడొద్దు.. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దు.
– ఆర్.చందు, గాంధీనగర్, మాధవధార

అంపశయ్యపై ఆత్మగౌరవం



మూతపడిన బ్లాస్ట్‌ఫర్నేస్-1

'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే బాధ్యత నాది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, సెంటిమెంట్, త్యాగాలను అమ్మేస్తామంటే చూస్తూ ఊరుకోను. చేత కాకపోతే తప్పుకోండి.. నేను ఎంతవరకైనా వెళ్లి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటాను'. ఎన్నికలకు ముందు చంద్రబాబు మాటలు.

'ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే కార్మికుల కడుపే కాలుతుంది. మీరు ఉద్యమించకుండా.. నన్ను రోడ్డు మీదకు రమ్మంటే రాను. మీరు బయటకొస్తే.. నేను మీతో కలిసి వస్తాను.. కేంద్రాన్ని ఒప్పించి ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకునే బాధ్యత నాది.' ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ ఊగిపోతూ చేసిన ప్రగల్భాలు.

వీరి మాటలు నమ్మిన ప్రజలు కూటమికి అధికారం అప్పగించారు. అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఊపిరి తీస్తుంటే.. చంద్రబాబు, పవన్‌లు కనీసం నోరు మెదపడం లేదు. నిర్వీర్యం దిశగా ఉక్కు పరిశ్రమను తీసుకుపోతున్నా.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. మూలధన సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి పూనుకున్నా.. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూసేసి ఉత్పత్తి తగ్గించే కుట్రలు చేస్తున్నా.. 500 మంది అధికారులను డిప్యూటేషన్‌పై ఇతర స్టీల్‌ప్లాంట్లకు, వీఆర్‌ఎస్ పేరుతో 4 వేల మందిని ఇంటికి పంపించే పన్నాగాలు పన్నినా.. ఆర్డర్లు మూసేసి దివాలా సంస్థగా స్టీల్‌ప్లాంట్‌ను చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నా.. అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయడం లేదు.

- స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి శరవేగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అడుగులు
- పరిశ్రమలో ఉత్పత్తి తగ్గించి నష్టాల్లో ఉన్నట్లు చూపించే కుట్రలు
- రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల మూసివేతతో 35 వేల టన్నులకు పడిపోయిన ఉత్పత్తి
- నోరు మెదపని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన కార్మికులు.. నేడు మహా ధర్నా

విశాఖ సిటీ: కూటమికి అధికారాన్ని అప్పగిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంపై కేంద్రం వెనక్కి తగ్గుతుందని.. కోటి ఆశలతో గెలిపించిన కార్మికులు, ఉద్యోగులు, తెలుగు ప్రజలకు చంద్రబాబు అండ్ కో గట్టి షాకిచ్చింది. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా తీసుకుంటున్న నిర్ణయాల పట్ల కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంటే.. కూటమి నేతలు మాత్రం తప్పించుకొని తిరుగుతున్నారు. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకుంటామని, అవసరమైతే ఉద్యమిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు నిరసనలు తెలుపుతున్న కార్మికుల నోళ్లను బలవంతపు అరెస్టులతో మూయించాలని చూస్తుండడం గమనార్హం. స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి చాపకింద నీరులా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోందని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు, కార్మికులు రగిలిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ఆదివారం మహా ధర్నాకు సిద్ధమయ్యారు.

మూడు నెలల్లో పరిస్థితి తారుమారు



అన్నపూర్ణ బ్లాస్ట్‌ఫర్నేస్-3

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే స్టీల్‌ప్లాంట్ పరిస్థితి తారుమారైంది. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఎన్డీయే వరుస నిర్ణయాలతో స్టీల్‌ప్లాంట్‌ను దివాలా దిశగా తీసుకువెళ్తోంది. ముందుగా మూలధనం సమీకరణ పేరుతో ఆస్తుల వేలానికి సిద్ధమైంది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఉన్న ఖరీదైన భవనాలు, స్టాక్‌యార్డుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఇస్పాత్) బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ.476.18 కోట్లుగా లెక్కగట్టింది. ఆ వెంటనే ఉత్పత్తిని తగ్గించే కుట్రలో భాగంగా రెండు నెలల క్రితం బ్లాస్ట్ ఫర్నేస్-1ను మూసివేసింది. సాధారణంగా స్టీల్‌ప్లాంట్‌కు ఏటా 73 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. కానీ సంస్థ నిర్వీర్యం చేయడానికి బ్లాస్‌ఫర్నేస్-1ను మూసేసిన కేంద్రం.. తాజాగా రెండు రోజుల క్రితం బ్లాస్ట్‌ఫర్నేస్-3ని బ్లోడౌన్ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం బ్లాస్ట్ ఫర్నేస్-2 ద్వారా మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా ఒక్కో దాని నుంచి రోజుకు 7 వేల టన్నుల ఉత్పత్తి అవకాశమున్నప్పటికీ.. బీఎఫ్-2 ద్వారా కేవలం 4 నుంచి 5 వేలు మాత్రం స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రధానంగా సంస్థను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించడానికి మూలధనం వ్యయం ఇవ్వని కేంద్రం.. సుమారు 4 వేల మంది ఉద్యోగులను వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించడానికి రూ.1,261 కోట్లు కేటాయించడం విశేషం. దీంతో పాటు మరో 500 మంది ప్లాంట్ అధికారులను ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని తీర్మానించారు. వీరితో పాటు 25 శాతం మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది తగ్గించాలని నిర్ణయించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఈ వరుస నిర్ణయాలతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఉలిక్కిపడ్డారు. దీనిపై వరుస ఉద్యమాలకు సిద్ధమయ్యారు.

విజయసాయిరెడ్డి ట్వీట్‌తో ఉలికిపాటు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం వేగంగా అడుగులు వేస్తున్నా.. స్థానిక కూటమి ప్రజా ప్రతినిధులు ఇప్పటివరకు ఆ విషయంపై నోరెత్తలేదు. గతంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ లేఖను స్పీకర్‌కు పంపించారు. కానీ ఇప్పుడు ప్లాంట్ ఉత్పత్తిని దెబ్బతీసేలా నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ.. రాజీనామా చేయకపోయినప్పటికీ.. కనీసం ఉద్యమం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదిలా ఉంటే బ్లాస్ట్‌ఫర్నేస్‌ను మూసివేయడమంటే కార్మికుల గొంతు నొక్కడమేనని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చేసిన ఒక్క ట్వీట్‌తో కూటమి ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది.

బుజ్జగించేందుకు ప్రయత్నం

కూటమి నేతలు వెంటనే దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి శనివారం ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హుటాహుటిన పరిగెత్తుకెళ్లారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటానికి తాము అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామంటూ కార్మికులను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. కార్మికులు కష్టపడి పని చేయాలని భరత్ పేర్కొనగానే కార్మికులు నిలదీశారు. రెండు బ్లాస్ట్ ఫర్నేసేలను మూసేయడంతోపాటు ముడిసరుకు లేకుండా చేసేసి ఎలా పనిచేయాలంటూ ప్రశ్నలను సంధించారు. ప్రైవేటీకరణ జరిగితే పరిస్థితి ఏంటని కార్మికులు ప్రశ్నించగా పల్లా శ్రీనివాసరావు ఈ కర్మాగారాన్ని కాపాడలేకపోతే తాను రాజీనామా చేస్తానని తెలిపారు. ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇస్తేనే ఎన్నికల్లో గెలిపించామని..ఇప్పుడు రాజీనామా చేస్తామని చెప్పడం సరికాదని కార్మికులు పేర్కొన్నారు.

నాడు అడ్డుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

స్టీల్‌ప్లాంట్‌ను దివాలా పరిశ్రమగా చూపించే కుట్ర జరుగుతోంది. 2021లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. వెంటనే అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్లాంట్ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రానికి లేఖలు రాశారు. అంతటితో ఆగకుండా అసెంబ్లీలో సైతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. అలాగే విశాఖలో భారీ బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చిన సందర్భంలో కూడా వేదికపై లక్షల మంది ప్రజల సమక్షంలో ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దీనిపై మరింత ఒత్తిడి తీసుకురావాలని అప్పటి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు అప్పటి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో భారీ పాదయాత్ర చేపట్టారు. అప్పట్లో అది స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికే ఊపిరినిచ్చిందంటే అతిశయోక్తి కాదు. మరోవైపు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు, కార్మికులు, ఉద్యోగ సంఘాలు ఉద్యమించినా వైఎస్సార్ సీపీ వారికి పూర్తి స్థాయిలో సహకరించింది. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం వారితో కలిసి ఉద్యమించిన సందర్భాలు అనేకమున్నాయి. దీంతో కేంద్రం దూకుడుగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోయింది.



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విజయసాయిరెడ్డి పాదయాత్ర(ఫైల్)

ఉక్కు పిడికిలిపై ఉక్కుపాదం

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు ఉద్యమ కార్యాచారణ సిద్ధం చేసుకున్నాయి. కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు చేపడుతున్న నిరసనలను అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోగా.. ఉద్యమిస్తున్న కార్మికులపై ఉక్కుమోదం మోపుతోంది. ఇటీవల రాస్తారోకో నిర్వహించిన ఉద్యోగులు, కార్మికులను అరెస్టు చేయించింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సమితి ప్రతినిధులు, అన్ని సంఘాల నేతలు ఆదివారం మహా ధర్నాకు సిద్ధమయ్యారు.



ఈ నెల 10న కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మికుల రాస్తారోకో

రాజీయే రాచమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో 4,477 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



విశాఖ లీగల్: రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ జరిగితే.. వాటికి ఎటువంటి అప్పీలు లేదన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. తొలుత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తెల్హరి అమరావతి నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలోని విశాఖపట్నం, భీమునిపట్నం, గాజువాక, చోడవరం, అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, అరకు, పాడేరు, చింతపల్లి, మాడుగుల న్యాయస్థానాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4,477 కేసులు పరిష్కరించినట్లు ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ముగిసిన సింహాచలం ఈవో డిప్యూటేషన్

జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయాలని శ్రీనివాసమూర్తికి ఆదేశం




సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏడాది కాల డిప్యూటేషన్ పూర్తయింది. రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన్ని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శనివారం జీవో జారీ చేశారు. కాగా విశాఖ డీఆర్వోగా విధులు నిర్వర్తిస్తూ డిప్యూటేషన్‌పై గత ఏడాది సెప్టెంబర్ 15న శ్రీనివాసమూర్తి వచ్చారు. అదే నెల 17న ఈవోగా బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ నుంచి ఇప్పటి వరకు పలువురు డిప్యూటేషన్‌పై సింహాచలం ఈవోలుగా వచ్చారు. అయితే ఏడాది కాలం పూర్తి కాకుండానే, పలు విమర్శలకు గురై వారు వెనుదిరిగిన పరిస్థితులు ఉన్నాయి. అయితే డిప్యూటేషన్ కాలం పూర్తిగా పని చేసిన రికార్డు శ్రీనివాసమూర్తికే చెందుతుంది. ఈ కాలంలో అర్చకులను, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పాలనలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. నిత్య పూజలు, నిత్య ఉత్సవాలు, వార్షిక ఉత్సవాలను ఎలాంటి విమర్శలకు తావులేకుండా నిర్వహించారు. ఈ ఏడాది మే 10న చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఏప్రిల్‌లో జరిగిన వార్షిక కల్యాణోత్సవం, జూలైలో జరిగిన గిరి ప్రదక్షిణలను సైతం కనులపండువగా నిర్వహించారు. ఫిబ్రవరిలో సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని ఎంతో ఘనంగా చేపట్టారు. రాత్రి వేళ భోజన సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించారు. దేవస్థానంలో తొలిసారిగా హనుమత్ వాహన సేవను ప్రవేశపెట్టారు. రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు శ్రీనివాసమూర్తి హయాంలోనే ప్రారంభమవడం విశేషం.

ఇద్దరు హాస్టల్ ఉద్యోగుల సస్పెన్షన్

సీతమ్మధార: సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్-2కు చెందిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ సంక్షేమ అధికారి ఆర్.ప్రసాద్‌రావును సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం.అప్పారావును విధుల నుంచి తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతమ్మధార సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్-2లోని మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు అక్కడ విద్యార్థులను వినియోగించినట్లు ఈ నెల 9న కలెక్టర్‌కు ఫిర్యాదు అందించింది. విచారణలో నిజ నిరూపణ అయినందున దీనికి కారణమైన ఆ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

మేహాద్రి రిజర్వాయర్ గేటు ఎత్తివేత

- మూడో గేటు నుంచి 150 క్యూసెక్కుల విడుదల
- ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 59.6 అడుగులు



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ విడుదలవుతున్న నీరు

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేటును అధికారులు శనివారం ఎత్తారు. రిజర్వాయర్ నీటి మట్టం ఉదయానికి 59.9/61 అడుగులకు చేరుకోవడంతో గేటును తెరిచేందుకు అధికారులు నిర్ణయించుకున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ ఏ.త్రినాథం, ఏఈ పి.నళిని, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ మూడో గేటును మూడు అడుగుల మేర ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రికి మేహాద్రి నీటిమట్టం 59.6 అడగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు. ఇన్‌ఫ్లో అధికంగా ఉండడంతో ఆదివారం ఉదయం వరకు గేటును తెరిచే ఉంచుతామని వెల్లడించారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నోటీసు

జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్



డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు అందిస్తున్న వైద్యులు

మహారాణిపేట: తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) వైద్యుల జిల్లా సంఘం హెచ్చరించింది. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుకు సంఘ ప్రతినిధులు సమ్మె నోటీసు అందజేశారు. వైద్య నిపుణుల కోసం ఇన్-సర్వీస్ కోటాను అన్యాయంగా తగ్గించే జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. శనివారం అన్ని పీహెచ్‌సీల్లో అత్యవసన సేవలు మాత్రమే చూశారు. కాగా.. అమరావతి నుంచి వచ్చిన సమాచారం మేరకు రెండు రోజుల పాటు ఆందోళనలు వాయిదా వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎం.ఆర్ కిశోర్, కోశాధికారి డాక్టర్ హమ్మద్ హుస్సేన్ తెలిపారు. ఈ నెల 17లోగా ఎలాంటి హామీ రాకపోతే ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

12 అడుగుల కొండచిలువ కలకలం


కొండచిలువతో స్నేక్ క్యాచర్ కిరణ్

ఆరిలోవ: పాత డెయిరీ ఫారం వద్ద, ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులోని నీటి సరఫరా పంప్ హౌస్‌లో కొండచిలువ కలకలం రేపింది. జీవీఎంసీ నిర్మించిన ఈ పార్కు పక్కనే నీటి సరఫరా విభాగానికి సంబంధించిన పంప్ హౌస్ ఉంది. సిబ్బంది రోజూ ఈ పంప్‌లో వాల్వ్‌లు విప్పి నీటి సరఫరా చేస్తుంటారు. శనివారం పంప్ హౌస్‌లో వాల్వ్ విప్పడానికి సిబ్బంది ఒకరు లోపలకు దిగగా, అందులో ఉన్న కొండచిలువను చూసి భయంతో పైకి ఎక్కే ప్రయత్నంలో అదుపు తప్పి పడిపోయాడు. అతని కేకలకు స్థానికులు, తోటి సిబ్బంది అక్కడకు చేరుకుని బయటకు లాగారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించగా.. అతను వచ్చి కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. సుమారు 12 అడుగుల పొడవున్న ఈ కొండచిలువను చూసి అంతా ఆశ్చర్యపోయారు. అనంతరం కిరణ్ కొండచిలువను కంబాల కొండలోకి విడిచిపెట్టడంతో స్థానికులు, ఏసీబీ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పార్కులో పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడం వల్లే పాములు చేరుతున్నాయని స్థానికులు అంటున్నారు.

శ్రీ నర్తన గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ స్వామి శనివారం భక్తులకు శ్రీ నర్తన గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలలో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరీ, ఉభయదాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి వారిచే సుందరకాండ పారాయణ జరిగింది. సాయంత్రం జిల్లా బాల భవన్ విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.



సామాన్యులకు అందని ద్రాక్ష

కొత్త వైద్య కళాశాలలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం సరైంది కాదు. గత సర్కారు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. అందులో ఐదు కళాశాలల్లో గత ఏడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల మా అబ్బాయి రాజమండ్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగలిగాడు. ఇలా గత ఏడాది ఏపీలో 750 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. రానున్న కాలేజీలను పూర్తి చేయకుండా ప్రైవేటుపరం చేయడం వల్ల వైద్య విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది.

– కాళ్ల రాము, కె.జె.పురం, మాడుగుల మండలం





పేదలపై ఎందుకంత కక్ష?

గత ప్రభుత్వం చేపట్టిన 'జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ' విధానం మాలాంటి పేద విద్యార్థులకు వరం. గతేడాది ఐదు కళాశాలలు ప్రారంభం కావడంతో ప్రతి చోట 150 మందికి సీట్లు లభించాయి. గతంలో మెడికల్ విద్యకు ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లేవాళ్లం. మన రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ఉన్నట్లయితే మాలాంటి పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను పూర్తి చేసి విద్యాబోధన చేయాలి.

– ఆర్.ఆదిశేషవ, నీట్ విద్యార్థి, అనకాపల్లి

మత్స్యకారులకు మొండి చెయ్యి!

- మూడు నెలలు గడిచినా అందని మత్స్యకార భరోసా
- వరుస వాయుగుండాలతో వేట లేక ఇబ్బందులు
- అస్తవ్యస్తంగా గంగపుత్రుల జీవనం

మహారాణిపేట: దాదాపు రెండు నెలల పాటు వేట విరామం.. ఆ తర్వాత వరుసగా అల్పపీడనాలు.. వాయుగుండాలు.. ఏప్రిల్ నుంచి సక్రమంగా వేట లేక జిల్లాలోని మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా కుంగిపోతున్నారు. ఒకవైపు వాతావరణం సహకరించడం లేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కనికరించడం లేదు. వేట విరామం ముగిసి మూడు నెలలు అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేకపోవడం వారిని మరింత నిరాశకు గురి చేస్తోంది. వాతావరణ హెచ్చరికలు కారణంగా ఇప్పటికీ వేట సక్రమంగా సాగకపోవడంతో గంగపుత్రుల జీవనం అస్తవ్యస్తంగా మారింది.

ప్రభుత్వ 'భరోసా'లేదు

ఏటా మత్స్య సంపద సంరక్షణ కోసం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు మత్స్య వేటను నిలిపివేస్తారు. ఈ రెండు నెలల కాలంలో వేటకు దూరమైన మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవడానికి కొన్నేళ్లుగా పరిహారం అందజేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేట విరామ సమయం ముగియక ముందే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి భరోసా నిధులు జమయ్యేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. వేట విరామం ముగిసి మూడు నెలలైంది. ఇప్పటికీ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు భరోసా నిధుల విడుదలపై కనీసం నోరెత్తడం లేదు. 2019 వరకు ఈ మొత్తం రూ.4 వేలు ఉండగా.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.10 వేలకు పెంచింది. ఏటా జూన్ 15వ తేదీ లోపే మత్స్యకారుల ఖాతాల్లోకి భరోసా నిధులు జమ చేసింది. జిల్లాల విభజన అనంతరం 2021లో 11,193 మందికి, 2022లో 11,389 మందికి, 2023లో 12,173 మందికి లబ్ధి చేకూర్చింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భరోసా ఊసే ఎత్తడం లేదు.


వలలకు మరమ్మతులు(ఫైల్)

12,221 మందితో జాబితా

జిల్లాలో మత్స్యకార భరోసా కింద లబ్ధిదారుల జాబితా ఇప్పటికే సిద్ధమైంది. విశాఖ జిల్లాలో 24 కిలో మీటర్ల తీర ప్రాంతం ఉంది. 15 మత్స్యకార గ్రామాలు, 30 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. 668 మరపడవలు, 1,272 మోటారు, 428 సంప్రదాయ ఇంజిన్ లేని తెప్పలకు ఈ పథకం వర్తించనుంది. దీని ప్రకారం జిల్లాలో 12,221 మంది లబ్ధిదారుల జాబితాను జిల్లా మత్స్యశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. కానీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వ సాయం ఎప్పుడు అందుతుందో అధికారులు సైతం చెప్పలేని దుస్థితి నెలకొంది. దీంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వ వైఖరిపై గంగపుత్రులు మండిపడుతున్నారు.

27న తపాలా అదాలత్

మహారాణిపేట: తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఎంవీపీకాలనీలోని పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ నెల 27న 115వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 23లోగా పంపాలని అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్ తెలిపారు. ఈ కవర్ మీద '115వ తపాలా అదాలత్'అని రాసి.. కె.వి.డి.సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం–530017కు పంపాలని సూచించారు.

ఆసక్తికరంగా మూట్ కోర్టు పోటీలు


న్యాయ విద్యార్థుల వాద ప్రతివాదనలు

పీఎంపాలెం: న్యాయ విద్యార్థులు.. తమ నైపుణ్యతను ప్రదర్శించడానికి మూట్ కోర్టు పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని విశ్రాంత న్యాయమూర్తులు అన్నారు. స్థానిక న్యాయ విద్యా పరిషత్ లా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆళ్వార్ దాస్ జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు–2024 శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల విద్యార్థులతోపాటు హైదరాబాద్ ఐసీఎఫ్ఐఏ, సింబయాసిస్ వంటి ప్రముఖ న్యాయ సంస్థల విద్యార్థులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన న్యాయ కళాశాలల విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరిని 22 బృందాలుగా విభజించి వివిధ దశల్లో కేసులు అప్పగించారు. వాటికి సంబంధించి వాద–ప్రతివాదనలు విని అనంతరం న్యాయమూర్తులు తీర్పు చెప్పారు. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో విజేతలను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేస్తామని ప్రిన్సిపాల్ అలక్‌చంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో 15 మంది విశ్రాంత న్యాయమూర్తులు, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్పీ రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్ పాల్గొన్నారు.

16న పీజీఆర్ఎస్ రద్దు

విశాఖ సిటీ: ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఈ నెల 16వ తేదీ సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పోలీస్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

CAUTION NOTICE

With regard to Construction of MVV GREENFIELD apartments at Yendada by M.V.V.Builders inland to an extent of 242 Sq yards covered by S.No 69/9B of Yendada village, Visakhapatnam.

This is to inform the general public at large that my client Smt.Suvvari Kavitha having been purchased the below mentioned scheduled property vide Doc.No. 3494/17 registered at SRO Madhurwada, has filed Suit for declarationand demolition of illegal structures along with recovery of possession of the land to an extent of242 Sq yards covered by S.No 69/9B of Yendada village, Visakhapatnam Rural Mandal, Visakhapatnam District within the limits of Madhurawada Sub-Registry and Greater Visakhapatnam Municipal Corporation against the M.V.V.Builders and **Sri.M.V.V. Satyanarayana managing Partner of M.V.V.Builders** before the Hon'ble 6th Additional Senior Civil Judge at Visakhapatnam O.S.No.264 of 2021 and after pursuing the matter on record the Hon'ble court has ordered to maintain **"Status-Quo"** which is still in force as on today.Hence it is to bring to the notice of the public at large that any transaction made between the third parties and the respondents/defendants with regard to land or flats being constructed by the M.V.V.Builders in the scheduled property has no binding on my clients and the title dispute of the scheduled land is pending adjudication before the Hon'ble court.It has come to notice of my client that violating the orders of the Hon'ble Court MVV Builders are constructing MVV GREEN FIELDS apartments and selling the Flats in the disputed property. Hence general public are hereby cautioned that as the Tittle of the property is yet to be adjudicated by the Hon'ble court, Public are hereby advised to exercise caution before entering into any sale transaction with regard to the above mentioned property.

SCHEDULE :

All that part and parcel of a vacant house site measuring an extent of Ac.0-05 cents or 242 Sq yards covered by S.No 69/9B of Yendada village, Visakhapatnam Rural Mandal, Visakhapatnam District within the limits of Madhurawada Sub-Registry and Greater Visakhapatnam Municipal Corporation which is **bounded by:** East:30 feet wide road, South:Land belongs to Sirugudi Simhachalam, West:Land belongs to Chettupalli Gurumruthy and others , North:Land belongs to Sirugudi Simhachala

RAJESH MATCHA, Msc; L.L.M, Advocate, AP HIGH COURT
VANKAYALA SANTOSH KUMAR, B.Tech, LLB. Advocate
AMARAVATHI, PH:9515970337

నవంబర్ 29 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

- ఏపీ కార్యదర్శి బాయిన శ్రీనివాసరావు
- ఇసుక కొరత తీవ్రంగా ఉంది: క్రెడాయ్ ప్రతినిధులు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం పంకజ్, క్రెడాయ్ ఏపీ కార్యదర్శి బాయిన శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో నవంబర్ 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో క్రెడాయ్ 10వ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ ఏపీ కార్యదర్శి బాయిన శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం పంకజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముంబయి తరహాలో విశాఖలోనూ రియల్ ఎస్టేట్ రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతోందన్నారు. భవన నిర్మాణానికి కావాల్సిన సమాచారమంతా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు క్రెడాయ్ నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోకు ఎస్‌బీఐ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందని, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన రుణ సదుపాయాల్ని కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కన్వీనర్ సీహెచ్ గోవిందరాజు మాట్లాడుతూ 30 వేల అడుగుల విస్తీర్ణంలో 100 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా.. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కొరత ఇప్పటికీ తీవ్రంగా ఉందని క్రెడాయ్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థలో లోపాలను సరిదిద్ది, అందరికీ అందుబాటులో ఇసుక ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంస్థ విశాఖ చాప్టర్ కార్యదర్శి వి.శ్రీను, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరాజు, కోశాధికారి అశోక్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలువలో పడి అటెండర్ మృతి


వెంకటరావు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: మద్యం మత్తులో ఓ ఉద్యోగి కాలువలో పడి మృతి చెందాడు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలివీ.. గాజువాక శ్రామికనగర్‌కు చెందిన ఎం.వెంకటరావు(55) స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటరావు శనివారం ఉదయాన్నే ఇంటి నుంచి బయటకు వచ్చాడు. చినగంట్యాడలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలోని నర్సరీ ఎదురుగా గల రోడ్డు పక్కన కాలువలో పడి మృతి చెందాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మద్యం మత్తులో కాలువలో పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతని కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటరావుకు భార్య పద్మ, కుమారుడు ఉన్నారు.

బాలికను కాపాడిన ఫొటోగ్రాఫర్లు


బాలికను ఒడ్డుకు చేర్చిన బీచ్ ఫొటోగ్రాఫర్లు

భీమునిపట్నం: బీచ్‌రోడ్డు కొబ్బరితోట వద్ద శనివారం పార్కును ఆనుకుని బీచ్‌లో కొట్టుకుపోతున్న రష్మిత అనే 12 ఏళ్ల బాలికను బీచ్ ఫొటోగ్రాఫర్లు రక్షించి ఒడ్డుకు చేర్చారు. నగరంలోని వేపగుంటకు చెందిన బాలిక కుటుంబ సభ్యులతో కలిసి బీచ్ పార్కుకు వచ్చింది. కాసేపు తీరంలో ఆడుకున్న తర్వాత స్నానానికి సముద్రంలో దిగింది. ఇంతలో బలమైన కెరటాలు ఆమెను లోపలికి తీసుకుపోయాయి. అక్కడే ఉన్న బోయవీధికి చెందిన బీచ్ ఫొటోగ్రాఫర్లు కాసరపు సతీష్, వాడమొదలు సతీష్, కదిరి గౌతమ్ కెమెరాలను పక్కన పెట్టి ఆమెను రక్షించారు. బాలికను కాపాడిన ఫొటోగ్రాఫర్లను పలువురు అభినందించారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు!

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


చంద్రశేఖర్ మృతదేహం

ఆరిలోవ: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. నిద్రమత్తులో బైక్ నడపడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. కొమ్మాదికి చెందిన కిల్లి అన్నంనాయుడు ఆర్టీసీ వాల్తేరు డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. శనివారం వేకువజామున 4 గంటలకు బైక్‌పై అన్నంనాయుడు, అతని కుమారుడు చంద్రశేఖర్(22) వాల్తేరు డిపోకు బయలుదేరారు. తండ్రిని డిపో వద్ద దించేసి అనంతరం చంద్రశేఖర్ తిరిగి ఇంటికి వెళుతుండగా.. జూ పార్కు గేటు సమీపంలో హైవేపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన చంద్రశేఖర్ తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. వాహనచోదకుల ద్వారా సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అన్నంనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్ ఓ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ మొదటి సంవత్సరంలో చేరినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున నిద్రమత్తులో బైక్ నడపడం వల్ల డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి గురై ఉంటాడని భావిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న వర్మ, సురేష్‌కుమార్

భీమునిపట్నం: భీమిలి సమీపం కేతినేపేట వద్ద ఉన్న నన్‌స్కూల్‌లో శనివారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలను రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సీఎంఆర్‌కే వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 600 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య బాల బాలికలు, స్త్రీ పురుషులు ఉన్నారని.. వీరికి 11 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి డి.వి.రామారావు, ఉపాధ్యక్షుడు జె.డి.చక్రవర్తి, కోశాధికారి రాబర్ట్ శ్రీను, సంయుక్త కార్యదర్శి నల్లా శ్రీనివాస్, దివీస్ సంస్థ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'దసరా ఉత్సవ్'


ఎగ్జిబిషన్‌లో కొనుగోలుదారుల సందడి

బీచ్‌రోడ్డు: సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో 'దసరా ఉత్సవ్' పేరిట శనివారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని ఓల్డేజ్ హోం పునర్నిర్మాణంలో భాగంగా నిధుల సేకరణ కోసం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. 60 స్టాళ్లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆదివారం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం


సబ్‌వే వద్ద విరిగిపడ్డ శిలాఫలకం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో తొలిసారిగా ఆశీల్‌మెట్ట వద్ద 2012లో అండర్‌పాస్‌ను నిర్మించారు. అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు. కాగా.. ఈ శిలాఫలకాన్ని కొద్ది రోజుల కిందట గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఈ శిలాఫలకం మొత్తం ఊడిపడింది. అయితే ఈ శిలాఫలకానికి మరమ్మతులు చేపట్టి.. తిరిగి ఏర్పాటు చేయాల్సిన జీవీఎంసీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది.